## క్లుప్తంగా

### ఎంఈఓకు పరామర్శ



ఎంఈఓ ప్రభుదాసును పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్యంతో బాధపడుతూ దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిరుదొడ్డి ఎంఈఓ జోగు ప్రభుదాసును మిరుదొడ్డి మండల బీఆర్‌ఎస్‌ నాయకులు గురువారం పరామర్శించారు. ఎంఈఓ ఆరోగ్యవివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓను పరామర్శించిన వారిలో మిరుదొడ్డి మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ వల్లాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకులు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, నాయకులు గడ్డం జ్ఞానేశ్వర్‌, గొట్టం రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

### ఫేక్‌ కాల్స్‌పట్ల జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేటకమాన్‌: తెలంగాణ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ట్రాయ్‌) పేరుతో వచ్చే ఫేక్‌ ఫోన్‌ కాల్స్‌, మెసేజ్‌ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు సిమ్‌ కార్డులు బ్లాక్‌ అవుతున్నాయంటూ ఫోన్‌ చేస్తూ సైబర్‌ మోసాలకు పాల్పడుతున్నారని, అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదన్నారు. వ్యక్తిగత వివరాలు ఇతరులకు తెలుపకూడదన్నారు. అధికారుల ఫొటోలు ఉపయోగించి ఆసుపత్రుల్లో, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నామని ఎవరైనా డబ్బు పంపమని మెసేజ్‌ పంపితే ఎవరూ స్పందించకూడదన్నారు. అలాగే లోన్‌ యాప్‌లు, లాటరీలు, బహుమతులు, పార్ట్‌ టైం ఉద్యోగాల పేరుతో వచ్చే మెసేజలకు స్పందించొద్దన్నారు. సైబర్‌ మోసానికి గురైతే వెంటనే డయల్‌ 100,1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

### ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి పుస్తె, మెట్టెలు, ముక్కు పుడక, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని మాచాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకటేష్‌ ఉదయం అమ్మవారి దర్శనానికి ఆలయానికి వెళ్లగా గుడి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి ముక్కు పుడక, పుస్తె, మెట్టెలు కనిపించకపోవం, హుండీ తాళం పగులగొట్టి ఉండటం గమనించి ఆలయ నిర్వాహకులకు సమాచారం ఇచ్చాడు. ఆదివారం ఉత్సవాలు జరిగాయని కుల సంఘం సభ్యులు తెలిపారు. హుండీలోని రూ.10 వేల నగదు, ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


### పట్టపగలే వెలుగులు



అక్కన్నపేట మండల ప్రజాపరిషత్‌ వద్ద వెలుగుతున్న హైమాస్ట్‌ లైట్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అక్కన్నపేట మండల ప్రజాపరిషత్‌ కార్యాలయం సాక్షిగా హైమాస్ట్‌ లైట్‌లు పట్టపగలే వెలుగుతున్నాయి. గ్రామపంచాయతీకి అదనపు భారమని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. వీధిలైట్లకు ఆన్‌ఆఫ్‌ స్విచ్‌లు ఏర్పాటు చేసి పగలు వెలగకుండా చూడాలని కోరుతున్నారు.

### క్రికెట్‌ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రామారావు

కోహెడ(హుస్నాబాద్‌): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ టోర్నమెంట్‌ను కిమ్స్‌ విద్యాసంస్థ వైస్‌ చైర్మన్‌ పేర్యాల సాకేత్‌ రామారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌ఆర్‌ రావు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో విన్నర్‌, రన్నరప్‌లకు ట్రోఫీతో పాటుగా విన్నర్‌ జట్టుకు రూ.30 వేలు రన్నరప్‌ జట్టుకు రూ.20 వేలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు అశోక్‌, సుకుమార్‌, కందాల వేంకటేశ్‌, సుధాకర్‌, మైపాల్‌రెడ్డి, తాడెం మహేశ్‌, గడ్డం మహేశ్‌, రాజమౌళి పాల్గొన్నారు.

# సాగుకు సమాయత్తం



కోహెడలో మొక్కజొన్న సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

- ఏరువాకకు రైతులు సిద్ధం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- నిలకడలేని వానలు కురుస్తున్నా రైతులు సాగుబాట
- వరిసాగుపై అధిక శాతం ఆసక్తి
- 25న రోహిణి కార్తె సాగు ఆరంభం

రైతులు వానాకాలం సాగుకు సమాయత్తమయ్యారు. గత ఏడాదిలా కాకుండా సాగు సక్రమంగా కొసాగాలని కోటి ఆశలతో సాగు ప్రారంభిస్తున్నారు. ఈ ఏడాదిలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు తెలపడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. దీంతో తమ పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచింది.

కోహెడ(హుస్నాబాద్‌): రేపటి నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో రైతులు తమ పొలాలను దుక్కిదున్ని సాగుకు సిద్ధమయ్యారు. నిలకడలేని వానలు కురుస్తున్నా పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గత యాసంగి సాగులో అతివృష్టి, అనావృష్టితో కనీస పెట్టుబడులు రాక అప్పుల్లో కురుకుపోయారు. ఈ వానాకాలం సాగులో అధిక దిగుబడులు పొంది ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు ఆశిస్తున్నారు.

**వానాకాలం సాగు ప్రణాళిక**

ఖరీఫ్‌ సాగు కోసం వ్యవసాయ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రస్తుతం 250 వేల మెట్రిక్‌ టన్నులు యూరియా, డీఏపీ, 15 మెట్రిక్‌ టన్నుల కాంప్లెక్స్‌ ఎరువులను అందుబాటులో ఉంచారు. వానాకాలం సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తుందుకు రూపొందిచినట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే వరి 1,050 టన్నులు, మొక్కజొన్న 38 టన్నులు, పత్తి 1,250 ప్యాకెట్లు, పెసర 5 టన్నుల విత్తనాలు అందుబాటులో ఉంచారు. 60 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు రైతులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

**విత్తనాల షాపుల్లో తనిఖీలు**

నకిలీ విత్తనాలు అరికట్టేందుకు మండలంలోనిఫర్టిలైజర్‌ షాపుల్లో వ్యవసాయ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టాక్‌ వివరాలు, నగదు బిల్లు పుస్తకాలను వినియోగించాలని షాపు నిర్వాహకులకు సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

### రోహిణి చివరిలో నారు పోస్తే..



రోహిణి కార్తె చివరిలో, జూన్‌ 5 లోపు వరినారు పోస్తా. ఈ కార్తెలో భూమిలో విత్తనం పడితే మంచి దిగుబడి వస్తుంది. పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి. వ్యవసాయ అధికారులు పంటల పరిశీలనకు రావాలి. పంట చేతికి వచ్చేవరకు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

– జనగామ యాదగిరి, రైతు కోహెడ

### విత్తనాలు, ఎరువులు సిద్ధం



వానాకాలం సాగుకోసం విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాం. తొలకరి వానలతో విత్తనాలు విత్తొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సరిపడా వర్షపాతం నమోదయ్యాకే పత్తి, మొక్కజొన్న, కంది, తదితర పంటలను సాగు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన షాపుల్లో నగదు బిల్లు తీసుకోవాలి. నకిలీ విత్తనాల విక్రయంపై ప్రత్యేక నిఘా పెట్టాం. సాగుపై సలహాలు, సూచనల కోసం ఏఈఓలకు గ్రామాలను కేటాయించాం.

– భోగేశ్వరస్వామి, ఏఓ, కోహెడ

# ఎంపీపీ అవిశ్వాసంపై ఆసక్తికర చర్చ



మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఎంపీపీపై ఉమ్మడి మండల ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మండల వ్యాప్తంగా ఆసక్తికర చర్చ సాగుతోంది. ఎంపీపీ గజ్జెల సాయిలును గద్దె దింపడమే లక్ష్యంగా మెజారిటీ ఎంపీటీసీలు ఉన్నట్లు తెలిసింది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కావాలనే అభివృద్ధి ప్రారంభోత్సవాలకు పిలవకుండా అవమానిస్తున్నారన్న కారణంతో లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆ పార్టీని వీడిన ఎంపీపీ ఏప్రిల్‌ 27వ తేదీన కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో వైస్‌ ఎంపీపీ పోలీస్‌ రాజులుతో పాటు ఎంపీటీసీలు సుతారి నర్సింహులు, ధర్మారం లక్ష్మి, దండబోయిన లలిత, కీసరి రాజవ్వ, చెప్యాల శ్రీనివాస్‌, కాపర్ల భాగ్యలక్ష్మి అదే నెల 29న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతూ సిద్దిపేట ఆర్డీఓ పి.సదానందంకు తీర్మాన పత్రాన్ని అందజేశారు. కాగా ఉమ్మడి మండలంలో 11 ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో ఆరుగురు అవిశ్వాసం ప్రకటించడంతో బలనిరూపణ అనివార్యమైంది. దీంతో ఈనెల 27వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీకి వ్యతిరేకంగా ఎంపీటీసీలు తీర్పునిస్తే ఎంపీపీ ఎస్సీ రిజర్వేషన్‌ కావడంతో మిరుదొడ్డి, ధర్మారం, ఖాజీపూర్‌ ఎంపీటీసీలు ఎంపీపీ బరిలో ఉండే అవకాశం ఉంది. వీరంతా దుబ్బాక ఎమ్మెల్యే వద్దకు వెళ్లినట్లు తెలిసింది. కాగా తెలంగాణ పంచాయతీ రాజ్‌ చట్టం ప్రకారం ఎంపీటీసీల పదవీ కాలం జూలై 7 నాటికి ముగియనుంది. కేవలం ఒక నెల మాత్రమే పదవీ కాలం గడువు ఉండగా పదవితో వచ్చేదిలేదు పోయేది లేదన్న ధీమాతో ఎంపీపీ క్యాంపు రాజకీయాలు చేయడంలేదని, కోర్టు స్టే ఆర్డర్‌ తెచ్చుకునే పనిలో ఉన్నట్లు సమాచారం.

# సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌

దుబ్బాకరూరల్‌: మండలంలోని రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్‌ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. 12 వారాల లోపు గర్భిణులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బిడ్డకు బిడ్డకు కనీసం మూడు నుంచి నాలుగు సంవత్సరాల ఎడమ ఉండే విధంగా ప్రసవించిన తల్లికి తెలపాలన్నారు. దోమల ద్వారా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ వినోద్‌ బాబ్జి, వైద్యాధికారి సీసీ డెనియల్‌, మెడికల్‌ ఆఫీసర్‌ హిమబిందు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బుద్ధుని బోధనలు ఆచరణీయం

హుస్నాబాద్‌: విధ్వంసమైన నేటి వ్యవస్థ పరిరక్షణకు బుద్ధుని బోధనలు చాలా తోడ్పడుతాయని హుస్నాబాద్‌ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్‌ మేకల వీరన్న యాదవ్‌ అన్నారు. ప్రగతి శీలులు, అభ్యుదయవాదుల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో బుద్ధుడి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరన్న యాదవ్‌ మాట్లాడుతూ అసమానతలు, అంతరాలు, సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపుకల్పన చేయడానికి బుద్ధుని బోధనలు అవసరమన్నారు. ప్రతీ ఒక్కరూ బు ద్ధుని బోధనలు అధ్యయనం చేయడం, సమాజ పరిశీలినపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**ఎంపీడీఓ రామ్మోహన్‌**

మద్దూరు(హుస్నాబాద్‌): గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్‌ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని లద్నూర్‌ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న భూమి చదును పనులను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో విద్యుత్‌ పనులు, రెండు గదులలో ఫ్లోరింగ్‌ పనులను పరిశీలించారు. ఈనెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను వచ్చే హరిత హారం నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. మామిడి, మునగ, నిమ్మ, దానిమ్మ తదితర మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): మండలంలోని శనిగరం గ్రామ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్‌ కర్ర జయశ్రీ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ సహిత యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

### రాజీయే రాజమార్గం

**దుబ్బాక జూనియర్‌ సివిల్‌ ప్రథమ శ్రేణి జడ్జి తరణి**



మాట్లాడుతున్న జడ్జి తరణి

దుబ్బాకటౌన్‌: కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ మెగా లోక్‌ అదాలత్‌ ఉపయోగపడుతుందని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక జూనియర్‌ సివిల్‌ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముగంటి తరణి అన్నారు. దుబ్బాక కోర్టులో జూన్‌ 8వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్‌ అదాలత్‌కు సంబంధించి గురువారం దుబ్బాక పోలీస్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నమోదైనా కేసుల్లో ఇరువర్గాల సమస్యల పరిష్కారానికి లోక్‌ అదాలత్‌ ఉపయోగ పడుతుందని, రాజీయే రాజ మార్గమన్నారు. సివిల్‌, క్రిమినల్‌, కాంపౌండబుల్‌, చెక్‌ బౌన్స్‌ తదితర కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌, ఎస్సైలు గంగరాజు, రవి కాంత్‌ పాల్గొన్నారు.

### బీజేపీ అభ్యర్థికి ఓటు వేయండి

కొమురవెల్లి(సిద్దిపేట): ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్గోజు నాగరాజు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మర్రిముచ్చాల గ్రామాల్లో ప్రేమేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కప్పర ప్రసాద్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమరాణి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌
- బోనాలు, ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

హుస్నాబాద్‌: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మున్సిపల్‌ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌ ఆకుల రజిత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గౌడ కులస్తులు అమ్మవారికి బాషికాలు కట్టారు. అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పంబాల పూజారులు ఎల్లమ్మ తల్లి కథలు చెప్పి భక్తులను ఆకట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు బోనాలు, ఒడి బియ్యం, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్‌ పూదరి లక్ష్మీనారాయణ, మున్సిపల్‌ కమిషనర్‌ మల్లికార్జున్‌, ఆలయ ఈఓ కిషన్‌రావు, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, గౌడ కులస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలతో వస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత

# సన్న బియ్యం పంపిణీకే బోనస్‌

**కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌**



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్‌

దుబ్బాకటౌన్‌: రేషన్‌ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్‌ ఇస్తుందని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్‌ అన్నారు. గురువారం దుబ్బాక పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ పాలనతో పోల్చుకుంటే కాంగ్రెస్‌ ప్రభుత్వం ఐకేపీ ద్వారా వడ్ల కొనుగోలు సెంటర్లను ముందుకుగా ప్రారంభించి రైతులకు అండగా నిలిచిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవినీతి జరగకుండా కొనుగోలు చేస్తున్నా తమ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్‌ బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ పాలనలో రైతు రుణమాఫీ ప్రక్రియ సరిగా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ఏడాది అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం రూ.10 వేల నష్ట పరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ నాయకుల మాయమాటలు నమ్మి రైతులు ఆందోళనకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ కాల్వ నరేష్‌, నాయకులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కోహెడ(హుస్నాబాద్‌): విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ రవీందర్‌ తెలిపారు. శుక్రవారం శనిగరం 132/33 కేవీ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున కోహెడ, రామచంద్రాపూర్‌, సముద్రాల, శనిగరం, చంచెల్‌ చెర్వుపల్లి గ్రామాలతోపాటుగా బెజ్జంకి మండలం బెజ్జంకి, బేగంపేట, కల్లేపల్లి, రేగులపల్లి, గుగ్గిళ్ల, తోటపల్లి, వడ్లూరు, దాచారం, గూడెం గ్రామాల్లో ఉదయం 7 నుంచి 10 వరకు విద్యుత్‌ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

**పుల్లూరు, రాఘవాపూర్‌ గ్రామాల్లో..**

సిద్దిపేటరూరల్‌: మండల పరిధిలోని పుల్లూరు, రాఘవాపూర్‌ గ్రామాల్లోని 33 కేవీ సబ్‌ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్‌ సరఫరా ఉండదని విద్యుత్‌ ఏఈ శ్రీధర్‌ రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు మరమ్మతులు నిర్వహించనున్న దృష్ట్యా విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

**మరమ్మతుల కారణంగా..**

బెజ్జంకి(సిద్దిపేట): శనిగరంలోని 132/33 కేవీ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏడీఈ మాణిక్యాలు తెలిపారు. బెజ్జంకి మండలం కేంద్రం తోపాటు బేగంపేట, కల్లేపెల్లి, రేగులపల్లె, గుగ్గిల్ల, తోటపల్లి, వడ్లూరు, దాచారం, గూడెం, కోహెడ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

### నిధులు విడుదలకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): గ్రామ పంచాయతీల్లో నిధులు లేక నిర్వహణ భారంగా ఉందని గురువారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ భానోతు జయరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడారు. కొన్ని నెలలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు నిలిచిపోయాయన్నారు. మైనర్‌ పంచాయతీల్లో జీతాలు ఇవ్వకపోడంతో కార్మికులు పనికి రావడంలేదని తెలిపారు. నిధులు విడుదలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గుగులోతు మోహన్‌ నాయక్‌, లక్ష్మీకాంతరావు, కొడిజుట్టు సుభాష్‌, సతీష్‌, మహేష్‌, రవీందర్‌, కార్తీక్‌, రజిని, జమున తదితరులు పాల్గొన్నారు.

### నాగారం కార్యదర్శికి అస్వస్థత

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై గురువారం ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పంచాయతీల అభివృద్ధి అంశాలపై సమీక్ష జరుగుతున్న క్రమంలో నాగారం కార్యదర్శి అస్వస్థతకు గురైంది. వెంటనే అధికారులు స్పందించి ఎంపీడీఓ కారులో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సర్పంచ్‌లు లేకపోవడంతో కార్యదర్శులు ఉదయం అల్పాహారం చేయకుండానే విధులకు హాజరవుతున్నారు. విధుల నిర్వహణలో అస్వస్థతకు గురైనట్లు అధికారులు తెలిపారు.

### కాంగ్రెస్‌ అభ్యర్థిని గెలిపించండి

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 27వ తేదీన జరగనున్న వరంగల్‌, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి పట్టభద్రులను కోరారు. గురువారం మండల పరిధిలోని తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జునపట్ల, గుర్జకుంట, రాంపూర్‌ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ బొడిగె నర్సింహులు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌, నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ ఎల్‌ఓసీ అందజేత**

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన ఉమారాణి పది రోజులుగా వెన్నుపూస వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చులకు రూ.లక్ష కావాల్సి ఉండగా ఈ విషయాన్ని కాంగ్రెస్‌ యూత్‌ నాయకులు, తిగుల్‌ మాజీ సర్పంచ్‌ భానుప్రకాష్‌రావు ద్వారా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.80 వేల ఎల్‌ఓసీ మంజూరు చేయడంతో గురువారం ఉమారాణి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గౌస్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

**◆ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**

నంగునూరు(సిద్దిపేట): ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని నంగునూరు ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ కిషన్‌ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అక్కేనపల్లి మోడల్‌ స్కూల్‌, నంగునూరు జూనియర్‌ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం 57 మంది, ప్రథమ సంవత్సరం ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

**◆ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు**

గజ్వేల్‌ రూరల్‌: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నర్సయ్య పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలోని మురికి కాలువలను శుభ్రం చేయించడంతో పాటు ప్రజలకు మురుగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఏఈఈ కిష్టన్న, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శివకుమార్‌, సిబ్బంది ఉన్నారు.

**◆ రుద్ర చండీయాగం**

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): వైశాఖ పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమాపార్థీశ్వర కోటిలింగేశ్వర ఆలయంలో రుద్ర చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయం శివనామస్మరణతో మారు మోగింది.

**◆ తహసీల్దార్‌కు వినతి**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో బుద్ధ విహార్‌ నిర్మాణానికి స్థలం కేటాయించాలని స్థానిక యువకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

**◆ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను నూతన విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్‌, జిల్లా అధ్యక్షులు రంజిత్‌రెడ్డి గురువారం డిమాండ్‌ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయాలన్నారు.

**◆ భూదేవమ్మ ఆరాధన**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లోని ధ్యాననిష్టాశ్రమ వ్యవస్థాపకుడు దయాందస్వామి తల్లి భూదేవమ్మ ఆరాధన గురువారం ఆశ్రమంలో నిర్వహించారు. ముందుగా దయానందస్వామి విగ్రహానికి పూజలు చేసి అనంతరం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్‌ భక్తులకు భిక్ష పెట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అన్నాడి రాంరెడ్డి దంపతులు, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశం, మాజీ సర్పంచ్‌ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ పశువులకు చిటుక వ్యాధి నివారణ టీకా**

మద్దూరు(హుస్నాబాద్‌): మండల పరిధిలోని మేకలు, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. మద్దూరు మండలంలో 1625 గొర్రెలు, 482 మేకలు ఉన్నట్లు గురువారం పశువైద్యశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్‌ హరికిషన్‌, పర్శయ్య, నవీన్‌, రాజు, గొర్రెల పెంపకదారులు పాల్గొన్నారు.

**◆ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

కోహెడ రూరల్‌ (హుస్నాబాద్‌): మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో ఐకేసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం తిరుపతి గురువారం పరిశీలించారు. వర్షాలు పడే అవకాశమున్నందున కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు.

**◆ మైక్‌సెట్‌ బహూకరణ**

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ మండలం తోటపల్లి గ్రామ హనుమాన్‌ దేవాలయానికి మైక్‌సెట్‌ను మాజీ సర్పంచ్‌ జనగామ రాంకిషన్‌రావు గురువారం బహూకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. హనుమాన్‌ స్వాములు మైక్‌సెట్‌ కావాలని అడిగిన వెంటనే స్పందించి రూ.25 వేల మైక్‌సెట్‌ అందించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు.